# మూడు నిమిషాలు

**వే**సవి సూరీడు పడమటిని కప్పుకునే వేళ - వీధిలోని ఆటపాటల కేరింతల కవ్వాలీని ముగించి పిల్లలు టి.వీ. ల ముందు ఛానల్స్ వేటలో మునిగితేల్తున్నారు.

పెరట్లో తులసి మొక్క దగ్గర సాయంత్రదీపం పెడుతున్నాను. ఇంట్లోంచి కేకలు. అరుపులు. ముందుగదిలోకి వచ్చాను.

"కార్టూన్స్ చూస్తాను" అంటున్నాడు బాబు.

"డిస్కవరీ చూడాలి" రెట్టింపు చికాకుతో అరుస్తోంది పాప. రోజూ వున్న తగాదానే. ఒక్క టీవీ. బోల్డన్ని ఛానల్స్. వాళ్ళిద్దరికీ ఎప్పుడూ ఏ ఒక్క ఛానల్ దగ్గరా పొత్తు కుదరదు. గొడవ. కేకలు. ఆ గొడవలో తలదూరిస్తే అమ్మపై అలక. అన్నంపై అలక. ఒక్క మాట మాట్లాడకుండా పూలసజ్జని అందుకొన్నాను. పెరట్లోకి వచ్చాను. బావి పక్కన జామిచెట్టు కిందనున్న నవ్వారు మంచంపై కూర్చున్నాను. పూలమాల కడుతున్నాను. మల్లెపూలు, పెరట్లో పూసినవి. రోజూ సాయంత్రం పాప కోస్తుంది. మాలకట్టి వో మూరడు రాముడికి, మరో మూర పాప జడలో పెట్టటం.

మల్లెపూలంటే ఎంతిష్టం! కార్తీకంలో పెళ్ళి చేస్తే మల్లెపూల్జడ వుండదని మాఘంలో చేయమని పట్టుపడితే వదిన ఎంతగా హాస్యమాడింది!

ఆ రోజు బాగా గుర్తు. ఎర్రంచు తెల్లని గద్వాల చీర. మల్లెపూల్జడ. గోరింట పండిన చేతులు. ఎర్రని మట్టిగాజులు. పాదాలకి పారాణి. వెండిమట్టెలు. కొత్త పట్టీలు. మెడలో రవ్వంత వన్నెతగ్గని పసుపుతాడు. నల్లపూసలు, తాంబూలపు పెదవులు. నిజం చెప్పొద్దూ నాకు నేనే వో వెన్నెల మెరుపుగా, పరిమళ పవనంగా తోచాను.

గదిలోకి వెళ్ళాను. మల్లెల పరిమళం. గోరింట కమ్మని సువాసనా, పసుపుగంధపు సమ్మేళన సౌగంధాన్ని అతను ఆస్వాదించలేదు. గాజుల చిరుసవ్వడిని వినలేదు. గదిలో గుబాళించే పన్నీరు, అగరుపొగలూ మబ్బుతునకలూ అతన్ని కదిలించలేదు. అతను దీపం తీసేసి శరీరాన్ని ఆక్రమిస్తుంటే ఏమిటిది అనుకునేలోగా 'అంతా అయిపోయిందని' అతను అటు తిరిగి మత్తునిద్రలో మునిగిపోయాడు.

అతనికి ఏ అవయవం పట్లా కుతూహలం లేదు. కొత్తదనాన్ని వెతుక్కోలేదు. అతనికి నాలో కనిపించినవి మూడే భాగాలు అంతే. అతని శరీరానికి కావల్సినవి ఆ మూడే.

దేహాలు యిలానే కలుస్తాయనే అమాయకత్వమో అజ్ఞానమో నాకున్నా 'ఇంతేనేమో' అని నమ్మేదాన్ని. కాని తనువులు పెనవేసుకుపోవటమంటే ఒక వసంత మేఘమో మరో శ్రావణమేఘమో పలకరించుకోవటం. వర్షం పడిన మట్టివాసనంత పరిమళ భరితం. ఆశ్వీజాన పువ్వులు పూసిన అరణ్యమంత వర్ణగుచ్ఛమని గొప్ప విశ్వాసం. ఆరాధన....స్వప్నం....

మరి...ఇదేంటి? ఆ రోజు నుంచి నా జీవితంలో రంగులూ లేవు. పరిమళాలూ లేవు. ఉన్నదంతా చీకటి రాపిడి.

నిర్లిప్తత....ఇద్దరు పిల్లలూ పుట్టారు.

ఇప్పుడా చీకటి ప్రళయంలో నిర్లిప్తతతోపాటు భయం. మరణమంత భయం....

తలుపు చప్పుడు. తీసాను.

ఎదుట నిలబడ్డ శంకర్ని చూడగానే మనసులో బెదురు. శరీరమంతా

సలసలా పాకుతోన్న భయం.

అతను బ్రీఫ్‌కేస్ మంచంపై పడేసి షర్ట్ విప్పి వంకీకి తగిలించాడు.

"ఏం ప్రయాణాలో. మధ్యలో బస్సు టైర్ పంక్చర్. అః....స్నానానికి నీళ్ళు పెట్టు" అన్నాడు.

కాఫీ కలిపి యిచ్చాను. స్టవ్‌పై నీళ్ళు పెట్టాను.

ఎలా?! ఎలా తప్పించుకోవాలి? ఏమని చెప్పాలి?

"ఉత్తరాలేమన్నా వచ్చాయా?" అడిగాడు

వచ్చినవి ఇచ్చాను.

వాళ్ళింటి నుంచి మా యింటి నుంచి వచ్చిన ఉభయకుశలోపరి కార్డులు చదివి పక్కన పడేసాడు. నీళ్ళు మరిగాయి. తప్పించుకోటానికి దారి కన్పించలేదు. అతను స్నానానికి వెళ్ళాడు. క్యాంప్‌కి తీసుకువెళ్ళిన బట్టల్ని బ్రిఫ్‌కేస్ నుంచి తీసి వాటిని వుతికి ఆరేసి ప్రెస్ చెయ్యటం నాపనే.

బ్రిఫ్‌కేస్ తెరిచాను. క్యాంప్ బట్టలు. మాసిన బట్టల్లోంచి చౌకరకపు సెంటు కంపు. అతను ఇంట్లో వున్నప్పుడు సెంట్ వాడడు. అతను వూరు వెళ్ళొచ్చిన ప్రతిసారీ బట్టల్లోంచి నన్ను హెచ్చరించే రకరకాల చౌక సెంటుకంపులు.

బుసలు కొడుతున్న తాచుపాము.

బట్టలు మాసిన బట్టల పెట్టిలో పడేసాను. అతను స్నానం చేసొచ్చాడు.

"ఆకలేస్తోంది. వడ్డించెయ్" అన్నాడు.

వేడివేడి అన్నం. చారు. దొండకాయవేపుడు. కాల్చిన అప్పడాలు. కొత్తిమీర పచ్చడి.

"అబ్బా! ఆ వూళ్ళలో ఏం తింటామో ఏమో. యింటి తిండి సాటి ఏది రాదనుకో" పచ్చడి కలిపిన అన్నం ముద్ద నోట్లో పెట్టుకుంటూ.

ఇంటి రుచి.

ఊరి నుంచి వచ్చిన ప్రతిసారీ తొలిపూట భోజనం దగ్గర ఎప్పుడూ వినే మాటలే.

రెండోపూట భోజనం రుచించదు. 'ఏం వంటా'అనే చికాకే విన్పిస్తుంది.

"ఎవరైనా వచ్చారా? కంపెనీలో విశేషాలేంటి" అడిగాడు.

చాలానే వున్నాయి. కొత్తవి. ఎప్పటినుండో వున్నవి. ఇప్పుడిప్పుడే బయట పడుతున్నవి.

"ఏమిటి" తిరిగి అడిగాడు.

"ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తాడే, రామసూరికి బాగులేదని కంపెని హాస్పటల్‌కి వెళ్ళారంట. ఇక్కడ వాళ్ళకి ఏం జబ్బో అంతుపట్ట లేదంట. వైజాగ్ సి.డి.ఆర్. కి పంపించారంట. అక్కడ తేలిందంట. ఆ జబ్బుకి మందు లేదంట. అతనికీ జబ్బుందనీ తెలిసీ ఆ వీధివైపే తొంగి చూడటానికి అంతా భయపడ్డారు. పాలవాళ్ళు, చాకలి, కూరలమ్మేవాళ్ళు ఎవ్వరూ అటు పోలేదు. ఆ వీధిలో వుంటున్నవాళ్ళు వాళ్ళని యిల్లు ఖాళీ చేయమన్నారు. ఈ గొడవంతా తెలిసి హెల్త్‌టీమ్ వాళ్ళు వచ్చారు. ఆ వ్యాధికిగురైనవాళ్ళని అలా వెలివేయనవసరం లేదని చెప్పారు. ఆ వ్యాధి ఎలా వస్తుందో, ఎందుకొస్తుందో వివరించారు. అప్పటికి అంతా కాస్త వూపిరి పీల్చుకున్నారు. రామసూరి భార్యని వైజాగ్ తీసుకువెళ్ళి టెస్ట్‌లు చేయించారు. ఆ రిపోర్ట్ రావటానికి టైమ్‌పడుతుందట. అతనికి భార్యతోనే కాకుండా వేరే స్త్రీలతో సంబంధాలున్నాయట. చుట్టుపక్కల వున్న అలాంటి ఆడవాళ్ళందర్ని అంతా కలిసి తరిమేసారు. వాళ్ళంతా చీపురుపల్లికి పారిపోయారంట. వాళ్ళదగ్గరికి వెళ్ళే మగవాళ్ళు మాత్రం దర్జాగా భార్యలకి ఈ రోగాన్ని అంటిస్తున్నారు. ఆ మగవాళ్ళని ఎవ్వరూ ఏం అనరు. పాపం ఆ ఆడవాళ్ళకి నిలువనీడ లేకుండా తరిమి తరిమి కొడుతున్నారు. రామసూరిని అడగ్గా అడగ్గా సత్తెనపల్లిలో వుంటున్న వరసకి మరదలయ్యే ఆవిడతో సంబంధం వుందని చెప్పాడు. ఆవిడని కూడా టెస్ట్ చేయిస్తారట. రామసూరి భార్యకి ఈ వ్యాధి సోకిందేమో? ఆవిడ వొట్టి అమాయకురాలు. అతని వల్ల పాపం ఈ వ్యాధి వచ్చిందను కోండి. మందు లేదుకదా. అతని వల్ల ఈమె మరణానికి చేరువవుతుంది. పిల్లలు వున్నారు. ఏంటో వాళ్ళ జీవితాలు. అసలు మగవాళ్ళు యిలా ఎందుకు ప్రవర్తిస్తారో మగవాళ్ళు....ని...."

"ఆఁ...ఛాల్లే, నేను వూరెళ్ళినప్పుడు బాగానే పెత్తనాలు చేస్తున్నావ్.

చాలా విషయాలు సేకరించావే. సరే. ఆ బూజేంటి. ఇంటి విషయాలు పట్టించుకోవ్. కాని పూరందరి విషయాలు కావాలి" కళ తప్పిన ముఖంతో చికాకుగా అన్నాడు.

నా నోటికి బ్రేక్.

ఈ బ్రేక్‌ని బ్రేక్ చేస్తే మొత్తం సిస్టమ్‌ని బ్రేక్ చేసైటమేనేమో....ఎలా బ్రేక్ చెయ్యాలో?

పిల్లలు... వీళ్ళు ఎలానో...? వాళ్ళనే చూస్తున్నాను.

టి.వి.ని వదల్లేక వదలి పిల్లలు గదిలోకి వెళ్ళి నిద్రపోయారు. సర్దిన గిన్నెలే సర్దుతూ వంటగదిలో వుండిపోయాను.

"ఇంకా పని కాలేదా. ఛాల్లే...రా" అన్నాడు.

వెళ్ళాలి. తప్పదు. చెప్పాలి. ఎలా చెప్పాలి?

అతని దేహం నా దేహాన్ని ఆబగా పెనవేసుకుపోతోంది. నా శరీరం మొగ్గలు విచ్చుకోవటం లేదు. చేతులతో అతన్ని మెల్లగా తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నాను. అసాధ్యం. అతని వుద్రేకబలం ముందు నా మొహమాట బలం సరిపోవటం లేదు.

అతను అతనులా కనిపించటం లేదు. నివురు గప్పిననిప్పులా తోస్తున్నాడు. ధారాపాతంగా భయం వర్షిస్తోంది. నిలువు గుడ్లువేసుకొని పరుపుకి అతుక్కుపోయాను. అతని సమస్త దేహమూ నిర్దేశించిన గురివైపు చొచ్చుకుపోతోంది.

సడీ చప్పుడు లేకుండా పాకుతూ శరీరాన్ని కాటువెయటానికి తాచుపాము వస్తోంది. వస్తుందొస్తుంది. కాటేస్తే జరజరా శరీరమంతా విషం పాకేస్తుంది. మందు లేదు. మరణం...మరణం....

చెప్పాలి....జాగ్రత్త తీసుకోమని చెప్పాలి.

ఎలా....ఎలా చెప్పాలి? ఇతనితో ఖచ్చితంగా ఎందుకు చెప్పలేక పోతున్నాను. జాగ్రత్తగా వుండు. మనం జాగ్రత్త తీసుకుందాం.

జాగ్రత్త.....మూడు అక్షరాలు మాట్లాడటానికి ఎంత తటపటాయింపు. మూడు ముళ్ళ బంధం నూరేళ్ళ జీవితాన్ని ప్రామిస్ చేసింది. కాని మూడు

అక్షరాలు మాట్లాడగలిగే చనువుని, దగ్గరతనాన్ని, స్వేచ్ఛని యివ్వలేక పోయింది.

'నాకీ రోజు వీలు కాదు' అంటే అతను 'ఎందుకు' అని సతాయిస్తాడు. 'పీరియడ్స్' అని ఈ రోజు వరకు సూటిగా చెప్పలేని మూగతనం.

పిల్లలు అప్పుడే వద్దు అనుకున్న కాలంలో కూడా ఆ జాగ్రత్తలు నేనే తీసుకున్నాను. ఆ గోలీలు నేనే మింగాను. తలతిప్పు, కడుపు తిప్పు అన్నీ తిప్పులు నేనే పడ్డాను. పిల్లలు అప్పుడే వద్దనుకుంటే "నేనే ఇన్ని తిప్పలూ పడలేను. నువ్వూ కాస్త జాగ్రత్తతీసుకో" అతనితో అంటే ఎంత చికాకుపడ్డాడు.

సంసారులు మాట్లాడేమాటలు కాదన్నాడు. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోమంటే 'శక్తి సామర్థ్యాలకి ముప్పు' అన్నాడు. అలాంటిదేం వుండదని తెలుసు. నేను అతన్ని వొప్పించటానికి ప్రయత్నించాను. ససేమిరా కాదన్నాడు. ఆ ఆపరేషన్ నేనే చేయించుకున్నాను.

ఇప్పుడు వాటన్నిటికి పరాకాష్టలా వుంది. నా ముందున్న భయానకస్థితి.

ఎలా చెప్పాలి?

వేరే స్త్రీల దగ్గరికి వెళ్ళద్దనాలా?

వేరే స్త్రీల దగ్గరికి వెళ్ళినప్పుడు జాగ్రత్త పడమనాలా? నా దగ్గరకి వచ్చినప్పుడు జాగ్రత్త తీసుకో అనాలా? 'అసలు నాకు యిప్పటికే ఏ రోగం లేదని పెర్‌ఫెక్ట్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకురా' అనాలా....

ఏదో ఒకటి అనాలి...ఏది వొకసారి చెవిలో ముద్దుపెట్టు....అని అడగలేవు కానీ జాగ్రత్త చెపుతావా...

ముద్దు...కౌగిలి...హాయి నిషిద్ధపదాలైన చోట నేను అతని మొత్తం అస్తిత్వాన్నే ప్రశ్నిస్తే ఈ యిల్లు ఇలానే వుంటుందా? ఆ పిల్లలు ఏమైపోతారో. 'బియ్యం నిండుకున్నాయి. బాబు స్కూల్ ఫీజ్....మీ మావయ్యగారి అబ్బాయి పెళ్ళికి ఏం చదివిద్దాం'.....ఈ మాటలూ ఆగిపోతాయి కదా....

అసలు యిదంతా అనుమానమేనేమో అనుకోటానికి లేదు. నాసిరకం సెంట్‌వాసన నిండిన బట్టలే సాక్ష్యం కాదు. నా శరీరమే వో సాక్ష్యం.

తొలిసారి కడుపుతో వున్నప్పుడు 'నిన్నాపొట్టతో చూస్తుంటే ఏంటోలా

వుంది' అంటు ఆరునెలలు నిండీనిండకముందే అమ్మావాళ్ళింటికి పురిటికి పంపించేసాడు. మూడు నెలల పాపని ఎత్తుకొని యింటికి వచ్చాను. తరువాత ఆరునెలలు పట్టింది- అతను అంటించిన రోగం నుంచి బయటపడటానికి.

"మొగుళ్ళని సరిగ్గా చూసుకోలేకపోతే చిల్లర తిరుగుళ్లు మరుగుతారు. తరువాత మీరేమో, యిలా రోగాలపుట్టలవుతారు. ఇంత మెత్తగా వుంటే ఎలా? పోయి అతన్నీ డాక్టర్‌కి చూపించుకోమను. నువ్వొక్కదానివి ట్రీట్‌మెంట్ తీసుకోవటంవల్ల లాభం లేదు" మెత్తమెత్తగా డాక్టరమ్మ మందలించింది.

శరీరానికి సంబంధించిన ఏ విషయం గురించి మాట్లాడాలని మొదలుపెట్టినా అతను 'ఏంటామాటలు బజారు ఆడాళ్ళలా' అంటూ చికాకుపడటం నాకు అనుభవమే. పదేపదే ఆ స్త్రీల గురించి అలా చులకనగా మాట్లాడటం వినలేక అతనితో ఏ విషయం మాట్లాడాలన్నా తటపటాయింపే.

నాకో రోగం అంటుకుంది. సర్వశక్తులు కూడదీసుకొని డాక్టర్ దగ్గరికి వెళ్ళాను. ఇప్పుడు యితనికి హెచ్చరించకపోతే నేను మందులని వాడటం అనవసరం కదా. ఎలా చెప్పాలి యితనికి అనుకుంటూండగా అతని బ్యాగ్‌లో మందులు. సో అతను ట్రీట్‌మెంట్ మొదలుపెట్టాడు.

అయినా అతనితో ఈ విషయం మాట్లాడాలనే అనుకున్నాను. కాని అడగలేక నోరు మూసుకున్నాను.

ఆ మధ్య టి.వి.లో వో సినిమా వచ్చింది. అమెరికాలో బానిసల మీద. బానిసలకి యజమాని 'నీ హద్దులు యివి' అని మాటలతో చెప్పడు. బానిసలకి తమ హద్దులు, సరిహద్దు-కామా, ఫుల్‌స్టాప్‌లతో సహా తెల్సిపోతాయి. వాటి ప్రకారమే వాళ్ళు మసలుకుంటుంటారు. అలానే పెళ్ళయిన మొదట్లోనే యితనికి నేనేంటో నాకు తెల్సిపోయింది.

గుర్‌(......గుర్‌(.......

పక్కకి చూసాను. గాఢనిద్రలో అతను. లాభం లేదు. నేనిలా నాలోనేనే కొట్టుకు పోతుంటాను. అతగాడేమో అతని గోల్ చేరుకొని

నిద్రపోతుంటాడు......

చెప్పగలనా....నావల్ల అవుతుందా.

మెల్లగా నిద్రలోకి జారుకున్నాను. ఎంత సమయం గడిచిందో తెలియదు. నా శరీరంపై బరువు.

"ఏంటిది" నిద్ర విడిపోతున్న స్వరం నుంచి అడిగాను.

ఇష్టం, ఆసక్తి, వుద్వేగం, ఎప్పుడో నడిసముద్రంలో కల్సిపోయాయి. మెలకువలో వున్నానో, లేదో అనే తలంపే లేకుండా ఆక్రమణ. ఇది అతగానికి అలవాటే. నాకు చికాకు రావటమూ కొత్తకాదు. కాని నేనా చికాకుని ఎప్పుడూ కంట్రోల్ చేసుకుంటూ వారించేదాన్ని. ఈసారి మాటలు నా అదుపులో లేవ్.

"నిద్రొస్తోంది" అన్నాను.

"నిద్రపో"

"లేవండి"

అతను నన్ను వదల్లేదు. శరీరాన్ని కబ్జా చేసే రాజకీయ దొంగలా తోచాడతను.

మూడు ముళ్ళు వేయించుకున్న నేరానికి అన్నింటా సగభాగం పంచుకోమన్నారు. సంతోషం-ఆనందం; సుఖం-దుఃఖం; శాంతి-అశాంతి-వీటిలో ఏం పంచుకున్నామో ఏమో కానీ దేహమూ-మనసూ సగంసగం అంటూ పంచుకోలేదు. ఇవన్నీ వో ఎత్తు. ఇప్పుడేమో ఇతను తన ఆనందం కోసం వెళ్ళి రోగాలని అంటించుకొచ్చి 'అర్ధభాగమేనా యిచ్చేది, కాదుగా.

జాగ్రత్త...జాగ్రత్త...ఎయిడ్స్ మరొకరికి సరఫరా చేయకుండా వుండటానికి జాగ్రత్త తీసుకోవాలి....

ఆ విషయం మాట్లాడకుండా శరీరాల కలయిక కుదరదు....

అతన్ని వొదిలించుకోవాలి. అతని శరీరం బారినుంచి నన్ను నేను కాపాడుకోవాలి. నన్నొక శరీరంగా తప్పా స్వీకరించలేని అతని దౌర్జన్యం నుంచి బయటపడాలి ఎలాగైనా.

అతను నా ఆలోచనతో, నా శరీరబాధలతో సంబంధం లేకుండా

నన్ను పాములా చుట్టుకుంటున్నాడు. నా వొళ్ళంతా ఎలాగో వుంది. అతను తాకిన ప్రతి భాగాన్నీ అతిదారుణంగా కోసి పారేయాలని వుంది. నేను తప్పించుకునే కొద్దీ అతని దేహం అహంకారంతో వూగిపోతోంది.

తప్పించుకోలేనా?

కాపాడుకోలేనా?

నా మనసూ, నా శరీరాన్నంతా కేంద్రీకరించి అతని శరీరాన్ని అవతలకి విసిరి కొట్టాను.

ఆ క్షణంలో......

అతను నా వైపు చూసిన చూపుల్లో ఏమేం కనిపించాయో నాకు తెలీదు. కాని అవేవీ నేను గమనించినా గుర్తించలేదు....నా కళ్ళల్లోంచి నిప్పులు రాలడం మాత్రం అతనికి తెలిసి వుండాలి. ఆ నిప్పుల వానలో అతను ఏమయ్యాడో కూడా నాకు తెలీదు. కాని.....నా దేహమ్మీద ఇప్పుడు నాకు నిజంగా గర్వమే పుట్టుకొచ్చింది.....

నిజంగా గర్వమే......!

